క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: 11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాయిమారుతీనగర్, మహాలక్ష్మీనగర్, రాఘవేంద్రనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అందుకు స్థానిక ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన కాసం



కాప్రా: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావును బీఆర్‌ఎస్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి కలిశారు. సోమవారం నేరేడ్‌మెంట్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో పాటు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, మురళీ పంతులు, వెంకటహరి పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మహిళను మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మల్కాపురం తాండాకు చెందిన గుగులోతు బుజ్జి(38) చిలుకానగర్ న్యూరాంనగర్‌లో ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని సేకరిస్తూ నిల్వ చేసుకుంది. ఆ బియ్యాన్ని ట్రక్కులోకి తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. దాదాపుగా 25 క్వింటాళ్ల బియ్యం, ట్రక్కును స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్త ఉప్పల్ పోలీసులకు కేసును అప్పజెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యూజీడీ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



రామంతాపూర్: డివిజన్ పరిధిలోని ఎండోమెంట్ కాలనీ రోడ్డు నెం.4లో డ్రైనేజీ సమస్య గురించి స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు సోమవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

అక్రమంగా వెలిసిన దుకాణాలతో ప్రమాదాలు



కాప్రా: ఈసీఐఎల్ టీఎస్ఐఐసీ కాలనీ రౌండ్ బిల్డింగ్ వద్ద అక్రమంగా వెలిసిన దుకాణాలతో తరచూ ట్రాఫిక్‌తో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని కాప్రా డీసీ శంకర్‌తో సోమవారం కాలనీవాసులు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రమేష్‌యాదవ్, నాయకులు వినోద్, మర్రి మోహన్‌రెడ్డి, మహేష్, లక్ష్మణ్‌గౌడ్, వెంకులు, శ్రీధర్, సోమేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



అల్వాల్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ నాయకులకు ఈటల రాజేందర్ సూచించారు. అల్వాల్, మచ్చబొల్లారం ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయన పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. త్వరలో పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు ముందస్తు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దండుగుల వెంకటేష్, గోపి, కరుణశ్రీ, సుజాత, శ్రీనివాస్, మల్లికార్జున్ యాదవ్ ఉన్నారు.

అన్ని రంగాల్లో రాష్ట్రం నెంబర్-1





మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి చిత్రంలో ఎంపీ సంతోష్ తదితరులు

- తెలంగాణ 2కే రన్‌లో ఫుల్ జోష్
- స్టెప్పులేసిన మంత్రి మల్లారెడ్డి
- పాల్గొన్న ఎంపీ సంతోష్‌కుమార్

మేడిపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం పీర్జాదిగూడలో జరిగిన 2కె రన్ హుషారుగా సాగింది. ఏవీఇన్‌ఫ్రా ప్రైడ్ గ్రౌండ్‌లో హోరెత్తించే డీజే పాటలకు మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, కలెక్టర్ అమయ్‌కుమార్, కమిషనర్ డీఎస్ చౌహాన్, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తదితరులు స్టెప్పులేశారు. రన్‌లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తెలంగాణ సాధించి 9 సంవత్సరాలు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి వెళ్లిన సందర్భంగా 2కె రన్ నిర్వహిస్తున్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. తొమ్మిది సంవత్సరాల్లోనే తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. ఆరోగ్య తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. మంత్రి మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ రాఘవతో కలిసి గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ మొక్కలు నాటారు. అనంతరం ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీష్ మృతిపై రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ తెలంగాణ రన్‌ను కుసుమ జగదీష్‌కు అంకితమిస్తున్నట్లు ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీసీపీ జానకి, ఏసీపీ నరేష్‌రెడ్డి, జవహర్‌నగర్ మేయర్ కావ్య, బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ ప్రణీత, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య యాదవ్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మన పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు



2కె రన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

మల్కాజిగిరి: తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. సోమవారం మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో గాంధీపార్కు నుంచి సఫిల్‌గూడ వరకు నిర్వహించిన 2కె రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థకు మన రాష్ట్రం కేటాయించినన్ని నిధులను దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కేటాయించలేదన్నారు. రాష్ట్ర భద్రత విషయంలో రాజీ పడకుండా పోలీసులు పనిచేయడానికి పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న ఘనత తెలంగాణ పోలీస్ వ్యవస్థకు దక్కిందన్నారు. నేరాల అదుపులో కీలకపాత్ర పోషించే సీసీ కెమెరాల ఏర్పాటులో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామన్నారు. కార్యక్రమంలో డీసీ రాజు, సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ సుధీర్‌కృష్ణ, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీతా యాదవ్, రాజ్యలక్ష్మి, జగదీష్‌గౌడ్, జీఎన్వీ సతీస్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, రాముయాదవ్, బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో పోలీసు విభాగం కృషి కీలకం

అల్వాల్: తెలంగాణ అభివృద్ధిలో పోలీసు విభాగం కృషి కీలకమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు సోమవారం అల్వాల్‌లో 2కే రన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ సాధించేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం తప్పనిసరి చేసుకోవాలన్నారు. దేశంలో తెలంగాణ పోలీస్ సేవలు ఆదర్శవంతంగా మారాయన్నారు. ఈ సెంటర్ నుంచి మంగాపురం కాలనీ ఫుట్‌బాల్ గ్రౌండ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అల్వాల్ సీఐ గంగాధర్, ట్రాఫిక్ సీఐ రాజు, డీఐ ఎస్ఐ పాల్గొన్నారు.



అల్వాల్‌లో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

వైద్యులు సేవాభావంతో పనిచేయాలి



కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అల్వాల్: సేవా భావంతో వైద్యులు పనిచేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. యాప్రాల్‌లోని లక్ష్మీనారాయణ ఆస్పత్రి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి వారికి బస్తీల్లో ఉండే ఆస్పత్రుల సేవలే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతయాదవ్, నిర్వాహకులు డాక్టర్ సత్యనారాయణబాబు, ధనలక్ష్మి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌర సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యం



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ మమత

అల్వాల్: పౌర సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అన్నారు. అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వార్డు కార్యాలయాల్లో నిర్వహించాల్సిన విధులను సిబ్బందికి ఆమె సూచించారు. ఒక్కో డివిజన్ కార్యాలయంలో పలు విభాగాలకు చెందిన 10 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిరంతరం అధికారులు, సిబ్బంది నిర్వహించే విధులను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్లతో పలు సూచనలు, సలహాలు వార్డు ప్రతినిధులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ నాగమణి, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితకిషోర్, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాం ప్రభువు మెడలు వంచిన వల్లభాయ్

– కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విగ్రహ ఆవిష్కరణలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మల్కాజిగిరి: నిజాం ప్రభువు మెడలు వంచి గడగడలాడించి నిజాంను ఓడించి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించి, త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ఘనత వల్లభాయ్ పటేల్‌దేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి డివిజన్ ఎస్‌పీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం దౌర్జన్యాలు, దోపిడీలు, హిందూ మహిళలను అవమానించిన తీరు తెలంగాణ సమాజం ఎప్పుడూ మర్చిపోదన్నారు. కొన్ని జిల్లాలు కర్నాటక, మహారాష్ట్రలో ఉన్నప్పటికీ ఆనాడు పటేల్ సాహసం కారణంగా, దేశభక్తుడిగా స్వాతంత్ర్యాన్ని ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి నిజానికి సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, నాయకులు ఆర్‌కె.శ్రీనివాస్, రాంబాబు, శ్రీకాంత్, రవియాదవ్, నాగరాజు, భానుప్రకాష్, వి.కె.మహేష్, బాలలింగం పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే మైనంపల్లి

ఎస్పీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నివాళులర్పించారు. వల్లభాయ్ దేశానికి అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులు జగదీష్‌గౌడ్, జీఎన్వీ సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, రాముయాదవ్, నర్సింగరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్: జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యతో కలిసి అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలోని మౌలిక వసతుల గురించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కులాలవారీగా మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



ఉప్పల్ తహసీల్దార్ గౌతంకుమార్‌కు సమస్యలను వినిపిస్తున్న మహిళలు

ఉప్పల్: ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయాన్ని బాధితులతో కలిసి ముట్టడించారు. కులవృత్తుల వారికి అందించే రూ.లక్ష ఆర్థిక సాయం పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధృవ పత్రాల కోసం మహిళలు రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందని రాగిడి లక్ష్మారెడ్డి తహసీల్దార్ గౌతంకుమార్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల వేళ ప్రతిసారి కొత్త పథకాలంటూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని దుయ్యబట్టారు. కుల వృత్తులకు వర్తించే స్కీంలకు దరఖాస్తు చేసుకోవడానికి ఆంక్షలు పెట్టవద్దని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్‌శెట్టి, పలకల నరసింహారెడ్డి, సంజయ్ జైన్, అబ్దుల్ రషీద్, ఆశు, రాఘవ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మేడిపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం చెంగిచర్ల గ్రామం శ్రీలక్ష్మీనరసింహ స్వామి హిల్‌కాలనీలో నివాసం ఉంటున్న విజయచక్రవర్తి(36) గతనెల 26వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ఆలయ నిర్మాణ భూమి పూజలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. పెంటారెడ్డి కాలనీలోని శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంను తొలగించి అందులో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలయాల ఏర్పాటుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. పాత దేవాలయం స్థానంలో ఆధునిక హంగులతో నూతన దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బోడుప్పల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవం



అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని నూతనంగా ఏర్పాటు చేసిన యూనివర్సల్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రిని రాష్ట్ర ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి, నిర్వాహకులు డాక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గోదావరి ఎగ్జిబిషన్



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఎగ్జిబిషన్



బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన గోదావరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నగర శివారు ప్రజలను ఆకట్టుకుంటోంది. ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు సందర్శకులతో కిటకిటలాడుతోంది. ప్రత్యేక ఆకర్షణగా ఈఫిల్ టవర్ ఉంది. జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, సోలంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్, జ్యూవలర్ స్టాల్స్, రెడీ మేడ్ స్టాల్స్, టాయిస్ స్టాల్స్, డ్రైఫ్రూట్స్ స్టాల్స్, షాపింగ్ మేళా, చిల్డ్రన్స్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, ఫుడ్ కోర్ట్స్ ఆకట్టుకుంటోందని నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. వేసవి విడిదిగా ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటోందన్నారు. నగర శివారు ప్రాంతాలైన బోడుప్పల్, పీర్జాదిగూడ, ఉప్పల్, ఘట్‌కేసర్ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం



చర్లపల్లిలో విద్యార్థులకు నోట్‌బుక్స్, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

– ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: కదం, పదం కలిపి ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్ చౌరస్తా నుంచి నాగోల్ వంతెన వరకు నిర్వహించే 2కె రన్‌ను సీఐ గోవింద ర్‌రెడ్డి, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, కార్పొరేటర్లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పటిష్ఠంగా ఉండటంతో పాటు జవాబుదారీతనం పెరిగిందని దాదాపు ఠాణాలు కార్పొరేట్ స్థాయిని మించి ఉన్నాయని, ముఖ్యంగా స్టేషన్లలో ఆధునిక వసతులు, అత్యాధునిక టెక్నాలజీతో నేరాలను అదుపు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ప్రజలందరూ కలిసి తెలంగాణ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, జేరిపోతుల ప్రభుదాస్, ఉప్పల్ తహసీల్దార్ గౌతంకుమార్, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కుషాయిగూడ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మారాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద చర్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీతో పాటు పది ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై నోట్‌బుక్స్‌తో పాటు పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బిల్డర్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి సమకూర్చిన రూ.10 వేల నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసి పటిష్ఠంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. గతేదాదికంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అప్పుడే తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు సరైన ఆట స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల హెచ్‌ఎం శోభారాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా పక్కనున్న ఖాళీ స్థలాన్ని చదునుచేయించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పాఠశాల అభివృద్ధితో పాటు పేద విద్యార్థులకు చేయూత అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బొడిగె రాజుగౌడ్, సామ్యూల్, డప్పు గిరిబాబు, సుధాకర్, కడియాల బాబు, గంప కృష్ణ, రెడ్డినాయక్, తాళ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



ఉప్పల్‌లో రాణా పరిధిలో 2కె రన్‌ను ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి